*మనుషుల మధ్య ఉన్న కమ్మనైన ఆత్మీయ అనుబంధాలు,
వాటి చుట్టూ అల్లుకునే చిన్న చిన్న భావోద్వేగాలూ...
మననూ, మన బంధాలనూ పటిష్టం చేస్తాయన్న నమ్మకంలోంచి
పుట్టిందే ఈ కథ.*

కొట్టం రామకృష్ణారెడ్డి

# 12 తాతిల్





అప్పటి దాంక పెంకుటింటి మీద తాండవమాడిన సూర్యుడు మెల్లగ ఇంటెన్కకు జారి, దిడ్డి దర్వాజలకెల్లి తొంగి సూడవట్టిండు.

ఇంటి ముందల ఆకిట్ల ఎండవోసిన వొడ్లను ఒక్క తానికి నూకి కుప్పచేయవట్టింది లక్ష్మి. గా ఆకిట్లనే ఒక బాజుకు లక్ష్మి కొడుకు రాజు ఒక కుప్పజేస్తుంటే, ఇంకో బాజుకు లక్ష్మి అత్త రుక్కమ్మ కుప్ప చేయవట్టింది.

ముంగలి దర్వాజలకెల్లి, దిడ్డి దర్వాజలకెల్లి... సూటిగ కండ్ల ముంగల కండ్లవడ్డడు సూర్యుడు, లక్ష్మికి.

పొద్దుమూక వట్టిందని ఇగ దబ్బ దబ్బ వొడ్లని ఒక్క తానికి నూక్కుంట, ఇంట్లకెళ్లి రెండు గుల్లలు తెమ్మని పంపింది కొడుకును. రాజు తెచ్చిన గుల్లని వొడ్లకుప్పకు అడ్డం పండవెట్టి అండ్లకు నింపుకుంట, "అత్తమ్మా!" అన్నది లక్ష్మి.

సప్పుడు జెయ్యలే గామె. గుల్లని వొడ్లతోని నింపి కొడుకు నెత్తికెత్తి, "గుమ్మిల పోసి రా!" అని ఇంకో గుల్లలకు వొడ్లు నూక్కుంట మల్ల, "అత్తమ్మా!" అన్నది లక్ష్మి.

"ఏందే నీ గున్సుడు, ఏందో చెప్పరాదు," అన్నది రుక్కమ్మ.

"రాజుకి గియ్యాల్నే ఆఖరి పరీక్షలై పోయినై, ఇగ రేపట్నించే తాతిల్లు. నెల పదిహేను రోజులంట ఎండాకాలం తాతిల్లు."

రుక్కమ్మ సప్పుడు జెయ్యలె.

"అమ్మ, నాయన కండ్లల్ల మెదులుతున్నరు, ఒక వారం పది దినాలు పొయ్యొస్త, నీ కొడుకును తోలిచ్చిరమ్మనత్తమ్మా!" మెల్లగ అన్నది లక్ష్మి.

"నేనొద్దన్నానే! పోయిరా గని, ఒక మాట మీ మామకు చెప్పి పో, ఎవరొద్దన్నరు."

"గట్ల గాదుగని, నేనెట్లడుగుత? నువ్వే ఒక మాట మామ చెవినెయ్యరాదు?"

గార్వాలవడ్డది లక్ష్మి.

"అట్లే తియ్! అడుగుత గని, జల్ది జల్ది గానీ ఇగ పొద్దుమూక వట్టింది. ఇంకా పొయ్యిగూడ రాజెయ్యలె," భరోసా ఇచ్చింది రుక్కమ్మ.

అంతట్లనే మెల్లెగా అడుగులడుగు ఏసుకుంట ఒచ్చి ఇంటి ముంగల ఉన్న అరుగు మీద కూకున్నడు రాములయ్య.

మామ అరుగు మీద కూకునుడు సూశి ఏడి పని ఆడనే ఇడ్సి లోపట్కి నడిసింది లక్ష్మి. వండెమింట్ల సేతులు కడుక్కోని, పెద్ద ఇత్తడి చెంబుతోని పేర్పుల కెల్లి నీళ్లు ముంచుకొచ్చి మామకిచ్చింది.

కోడలు తెచ్చిన నీళ్లు మొత్తం ఒక్క బుక్కల తాగి, చెంబును లక్ష్మి చేతిల వెట్టుకుంట, "ఇంత చాయ వొట్టు పొయ్యి బిడ్డ!" అన్నడు రాములయ్య.

అట్లనే అనుకుంట పొయ్యి రాజెయ్యనీకె లోపటికి పొయ్యింది లక్ష్మి.

తప్కుల చాయి గ్లాసులు పెట్టుకుని లక్ష్మి బయటికొచ్చేట్యాలకు ఆకిట్లున్న వొడ్లన్నీ గుమ్మిల పోసొచ్చి, తాత పక్కన కూకొని దమ్ము తీయవట్టిండు రాజు.

చాయి తాగి మనుమనితోని గదీ గిదీ ముచ్చట పెట్టుకుంటుండంగనే గడ్డి మోపెత్తుకొని, ఆవును కొట్టుకొచ్చి సాయమాన్ల కట్టేసి, కాల్జేతులు కడుక్కరానీకె ఇంటెనక జారట్లకొయ్యిండు, లక్ష్మి మొగడు అనంతయ్య.

పసువులన్నీ ఇండ్లమొకం పట్టినయి తొవ్వపొంటున్న దుమ్ము రేపుకుంట. ఇండ్లల్ల మీది చూర్లల్లకెల్లి జొన్న రొట్టెలు కాల్సిన వాసనా, పొయ్యిల పొగ వాసనా, పసుల కాళ్ల కింది దుమ్ము వాసనా కలగలిపి కమ్మగ వాసన రావట్టింది. కడుపులల్ల ఆకలి మొదలయింది.

సూర్యుడు ఊరిడిసిపెట్టి పోయిండు, పొద్దుగాల మల్లొస్తనని జెప్పి.

ఆవు ముంగల ఇంత గడ్డేసి, పాలు పిండుకొచ్చి తల్లికిచ్చినంక, ఇగ తండ్రి కొడుకు మనుమడు మొకం కాళ్ల జేతులు కడుక్కునంక వండెమింట్లకు ఒచ్చేట్యా లకు పీటలేసి పెట్టింది రుక్కమ్మ.

ఆల్లు ముగ్గురు గూసున్నంక ముంగల తల్లెలు వెట్టి జొన్నరొట్టె లేసింది. పొయ్యికాడున్న సత్తుగిన్నెల ఒండిన పుంటికూర తెచ్చి అందరి రొట్టెల మీదేసింది.

ముగ్గురు రొట్టెలు తినుకుంట రాజడిగే ప్రశ్నలకు, జవాబులు చెప్పవట్టిండ్రు.

ఇంకా పొయ్యికాడ గూసోని రొట్టెలు కొడతనే ఉన్నది లక్ష్మి. రొట్టెలు కొట్టు కుంటనే అత్త దిక్కు సూశింది. అప్పుడే రుక్కమ్మ గూడ లక్ష్మిని సూశింది.

పుట్టింటికి పొయ్యే సంగతి, మామ నడగమని కండ్లతోనే సైగజేసింది లక్ష్మి. నువ్వు జర సైసు అని రుక్కమ్మ గూడ కండ్లతోనే సైగ జేసింది.

మల్లొకపాలి రొట్టెలు దెచ్చి ఆల్లకిచ్చుకుంట, ఇగ మొదలుపెడదామాను కుంట, సిన్నగ దగ్గింది రుక్కమ్మ.

ఆమె కంటే ముందే రాములయ్య రొట్టె ముక్క తెంపి, పుంటి కూర అద్దుకుని నోట్ల వెట్టుకుని, "నీకెన్నొద్దులురా తాతిల్లు," మనుమడ్ని అడిగిండు.

"నెలపదిహేను రోజులు," రాజు.

"అట్లనా!" అనుకుంట రుక్కమ్మను సూసుకుంట, "రేపు పొద్దటి బస్సుకు పట్నం బోదాం, నాలుగొద్దులు కళమ్మ తానుండి, ఏమన్న కొనుక్కునేటి వుంటే కొను కొచ్చుకుందాం, ఎల్లమే లేశి తయ్యారుగుండు," అని మల్ల రాజుదిక్కు సూస్కుంట, "అత్త కాడికి పోదామొస్తవారా?" అడిగిండు.

రాజు సంతోషంతోటి తలకాయూపిండు.

అత్త కోడండ్లు మొకాలు సూస్కున్నరు. లక్ష్మి మొకం సిన్నవోయింది. కండ్లల్ల నీళ్లూరినయి.

మల్ల తెల్లారి, ఎల్తురు రాకముందే, ఫస్టు బస్సుకే తయ్యారయ్యింండ్రు రాజు, రుక్కమ్మ, రాములయ్య.

బయటికి నడ్సుకుంట అనంతయ్యను పిల్సి, సేతిల అయిదు వందలు పెట్టి "ఎండాకాలం బాయి కాడ పనేముండదని ఇంటి కాడనే కూసోకు. ఆవుకు మేత కోస్కరా, గట్లని సోపతి గాల్లతోటి ఏడికి తిర్గపోకు, పిల్ల ఒక్కతే ఉంటది ఇంటి కాడ," అని కొడుకుకు ఇల్లప్పగించి పట్నం పొయ్యిండు బిడ్డె తానికి రాములయ్య.

ఎట్లనుకున్నది ఎట్లాయే అని మొకమంత రొట్టెపెంక లెక్క మాడ్సింది లక్ష్మి. మామ మీద గొంతుల్దాంక కోపమొచ్చింది. సర్వ తిట్లు తిట్టుకున్నది.

✤

నాత్రోజులు పొయ్యొస్తమన్నోల్లు, వారం దినాల దాంక మల్ల మళ్లి సూడలే, పట్నం బోయిన రాములయ్య, రుక్కమ్మ, రాజు. లక్ష్మికి కూడా దినాలు మొగని తోటి బాగనే ఎల్లినయి. వారం రోజులు ఎట్లెల్లిపోయినయో తెలవనే తెల్వలె. బిడ్డె తాన్కి పట్నం బోయినోల్లు ఊకెనే రాక, ఒచ్చుకుంట కళమ్మ అత్తమామలను అంటే వియ్యపు రాల్ని, వియ్యంకుడ్ని ఎంట వెట్కోని దిగిండ్రు.

ఇగ ఇంట్ల కాలు వెట్టిన కాడి కెల్లి బిడ్డ అత్తమామలని కాలు కింద వెట్టనియ్య కుండ మర్యాద జేశిండు రాములయ్య.

ఒకనాడు కోడిని కోస్తే, మల్లొకనాడు గుడ్ల పులుసు వొండి పిచ్చిండు. ఒక నాడు ఊళ్లె యాటను కోసిండ్రని, రెండు కిలలంత పొట్టేలు మాంసం వొండిపిచ్చిండు. ఇగ ముర్కులు, సక్కినాలు, సెనగ గుడాలు దేనికీ లెక్క జెయ్యకపాయె.

ఒకనాడు గౌండ్లోలింటికి పోయి కల్లు లొట్టి చెప్పొచ్చిండు. మల్లొకనాడు బెల్టు దుక్నంల ఇస్కీ సీస దెప్పించిండు. ఆళ్లు ఉన్నన్ని దినాలు పండగ లెక్కనే గొట్టింది లక్ష్మికి. చేసినంతసేపు బాగనే సేస్తదిగని మల్ల అమ్మ నాయిన యాదికి రాంగనే మొకం నల్లగ జేస్కుంటది.

నాల్గు రోజులుంటమని ఒచ్చిన కళమ్మ అత్తమామలు వారం దినాల దాంక కాళ్లు బయట వెట్టకుండ సూస్కున్నడు రాములయ్య.

ఇంట్లున్నోల్లందరూ వాళ్ల మర్యాదల తలా ఇంత చెయ్యేసి ఈళ్ల మర్యాద నిలవెట్టుకున్నరు.

వియ్యంకుడికీ, వియ్యపురాలికీ బట్టలు వెట్టి కాళ్లు మొక్కి సాగనంపింద్రు అందరూ. ఆళ్లు పొయ్యేటప్పుడు చెప్పనే చెప్పిండు రాములయ్య, ''బావా! మీరు పట్నం బోంగనే, కళమ్మనీ, అల్లుడినీ పంపించుండ్రి, ఒక్క వారం దినాలు, నా బిడ్డ పుట్టింట్ల ఉండిపోతది.'' అని ఒక్క తీర్గ చెప్పి పంపించింద్రు రాములయ్య, రుక్కమ్మ.

గన్మ కాడ నిలవడి ఇవ్వన్నీ ఇంటనే ఉన్న లక్ష్మికి అరికాలిమంట నశాలాని కెక్కింది. గుడ్లల్ల నీళ్లు తిరుగుతుంటే సర్రున వండె మింట్లకుర్కింది. అత్తమామల మీది కోపమంత బొచ్చె, బోకులు మీద సూపెట్టవట్టింది.

''సీ, ఈల్లేం మనసులు, ఎవ్వల్కయినా బిడ్డె బిడ్డెనే, కోడలు కోడలే. బిడ్డె కోడలయితదా? కోడలు బిడ్డెయితదా? మొన్ననే ఆరం దినాలు బిడ్డె కాడ పట్నంల ఉండొచ్చి మల్ల వారం ఎల్లకముందే బిడ్డె అల్లుడ్ని తోలియ్యమంటున్నరంటే, ఏమ నాలె ఈళ్లని? కోడలికి కూడా అమ్మ నాయనలుంటరు, ఆళ్లకి గూడ ప్రేమలుంటయని ఎర్క గాదా గీల్లకి,'' అని ఒక్క తీర్గ గిన్నెలతోటీ, చెంబులతోటీ గోడెల్లగక్కింది లక్ష్మి.

''లచ్చిమీ... లచ్చిమీ,'' అని అత్త రుక్కమ్మ వాకిట్లకెల్లి పిలుస్తుంటే, 'మల్లేం మీదికి తెచ్చింద్రో,' ననుకుంట, ముక్కెగ సీదుకుంట గన్మల్లకొచ్చి బొమ్మలెక్క నిలవడి సూడవట్టింది లక్ష్మి.

''గట్ల సూస్తవేందే? పొయ్యి చెంబెడు నీళ్లు పట్కరా మీ నాయనకి,'' అని రుక్కమ్మ అంటుంటే, అవేవీ చెవులకందుతలేవు.

అప్పటి దాంక అత్తమామల మీది అక్కసుతోటి కండ్ల నిండ నీల్లూరుతుంటే, గవే నీళ్లు నాయనని సూడంగానే సల్లవడి బయటికొచ్చినట్టనిపించింది లక్ష్మికి.

''కళమ్మ అత్తమామని బస్సెక్కియ్యనీకె పోయినమా, ఆల్లెక్కే బస్సుల్నే దిగిండు మీ నాయన,'' అత్త రుక్కమ్మ మాటలు ఇనవడ్తనే ఉన్నయి.

నాయనకి కాళ్లు కడుక్కోనీకె నీళ్లిచ్చింది, మల్ల తాగనీకె ఇచ్చింది. తప్కుల నిన్న మొన్న చేసిన ముర్కులు, సకినాలు వెట్టిచ్చింది. అందరికీ చాయ సుక్క పోసింది. ఒక్క తాన కాలు నిల్వక ఇల్లంత గిరగిర ఇసుర్రాయి లెక్క తిర్గుతనే ఉన్నది లక్ష్మి.

అత్తనడిగి కోడ్ని కోసింది. మామకు జెప్పి మొగడిని కల్లుకు పంపింది. సీకట్లు కమ్ముకుంటున్న యాల సిదిమిన దీపమే అయ్యింది లక్ష్మి మొకం.

తలా రెండ్రెండు గిలాసల కల్లు దాగినంక అన్నానికి లేసింద్రు రాజు, లక్ష్మి మామ, నాయన. అనంతయ్య ఊళ్లెకి పోయినట్టుండు.

అన్నం దినేటప్పుడు చెప్పిండు రాములయ్య కోడలు లక్ష్మితోటి, "మిమ్మ తోల్క పోనీకె ఒచ్చిండమ్మా మీ నాయన, పొద్దటి బస్సుకు తయ్యారుగాండ్రి," అని లక్ష్మి నాయన దిక్కు సూస్కుంట, "మీ అల్లుడు రెండు దినాలయినంక ఒస్తడుగని, నువ్వు నా కోడలుపిల్లను మనుమడ్ని తోల్కపో," అని చెప్పిండు రాములయ్య. లక్ష్మి సప్పుడు జెయ్యలె.

'పదిహేనిరవై దినాల నుండి ఇయ్యాల తీరింది నన్ను అమ్మగారింటికి పంపియ్యనీకె,' అని మన్సులనే గుల్గుకున్నది. మొకమంత మాడ్సుకునే ఉన్నది, ఆళ్లు తింటున్నంత సేపు.

తెల్లారి, సీకట్లనే లేసి జల్ది, జల్ది ఇంట్ల, ఆకిట్ల ఊడ్సి, సాంపి సల్లింది. ఆవు పెండ దీసింది. పొయ్యి రాజేసింది, అందరికీ చాయి పెట్టిచ్చింది. జొన్నరొట్టెలు చేసి పెట్టింది. ఇగ బస్సు టైమయితుందని మొగనికి చెప్పి నాయనెనక కొడుకు రాజుని తీస్కొని నడిసింది.

కమీజు లోపటి కీసలకెల్లి ఇన్నూరు రూపాలు తీసి రుక్కమ్మ చేతిల పెట్టిండు రాములయ్య. అవి కోడలు చేతిల పెట్టి, రొంటిల దోపుకున్న చెయ్యి సంచిల కెల్లి పది రూపాలు తీసి మనుమడి చేతిల పెట్టింది రుక్కమ్మ. అత్తా మామకి పొయ్యొస్తనని పొడి మాటలు చెప్పి నాల్గడుగులు ముందల్కి ఏసినంక అక్కసంత నాయన ముందల కక్కింది లక్ష్మి.

"రాజుకు తాతిల్లిచ్చిన్నాడే అడుగుదామనుకుంటే, నాకంటే ముందే ఆళ్లు తయ్యారయ్యింద్రు. బిడ్డె తానికి వారందినాలు పోయింద్రు, పోయినోళ్లు పోక ఒచ్చేటప్పుడు కళమ్మ అత్తమామలను తోలుకొచ్చింద్రు. ఆళ్లగూడ వారం ఉండిపోయింద్రు. నువ్వియ్యాల ఒచ్చుడే నయమయ్యింది. మల్ల కళమ్మ మొగనితోని ఇయ్యాల్నో రేపో దిగుతది. ఆల్లందరూ మనుసులు, ఆళ్లకు ప్రేమలుంటయి గని మనం మనుషులంగాము మనకు ప్రేమలుండయి," మెటికలు ఇర్సింది లక్ష్మి.

"సిన్న పెద్ద లేకుండ ఊకె ఒర్లకు," గద్దిచ్చిండు లక్ష్మి నాయన.

"ఏ జన్మల్నో పుణ్యం జేసుకున్నందుకే దొరికింద్రు నీకు ఇసోంటి అత్తా మామా! నిజంగనే ఆళ్లు మనుసులు కారే, దేవుండ్లు. రాజుకు తాతిల్లు ఇచ్చిన్నాడే మనిషితోటి చెప్పి పంపిండు, ఇయ్యాల ఒచ్చి నిన్ను తోల్కపొమ్మని. వారందినాలు ఆళ్లు బిడ్డె తానికి రాజుని తీస్కోని పొయ్యింది, కళమ్మ మీద ప్రేమ, మీమీద ద్వేషం కాదు. మీ మొగుడు పెళ్లాలనిద్దర్నీ ఒంటిగా ఇడిసిపెట్టింది మీ మీద ప్రేమతోటే. ఎప్పుడు పని చేసేటోల్లకు గూడ అప్పుడప్పుడు తాతిల్లు గావాలనిపిస్తది. కొడుకు కోడలు సిలక గోరింకల్లెక్క దగ్గర గావాల్నని, మీ ఇద్దరికీ మీ ఇంట్లనే తాతిల్లిచ్చి ఆళ్లు పట్నం పోయింద్రు.

“బిడ్డెకు, అల్లునికి తాతిల్లియ్యనీకెనే ఆళ్ల అత్తమామని ఈడ్కి తోల్కొచ్చింన్రు. మల్ల బిడ్డెని అల్లుడ్ని ఈడికి పంపియ్యమన్నది ఎందుకంటే, వియ్యంకునికీ, వియ్యపు రాలికీ తాతిల్లిద్దామనే, ఆళ్లు గూడ తాతిల్లు దీసకుంటరు.

“మనకొచ్చే తాతిల్ల నుంచే మల్ల మంచిగా బతకాలనే ఆశ పుడ్తది, బల మొస్తది, ధైర్నం వస్తది, గ్నానం ఒస్తది.

“ఇస్కూలు పోరలకు ఎట్లయితే తరగతికీ తరగతికీ మద్యల తాతిల్లిస్తరో గట్లనే మనుసులకీ, శరీరాలకీ, మనసులకీ తాతిల్లు గావాలె. గది రాములయ్య బావకు మంచిగ తెల్సు.

“గదంత ఎందుకమ్మా, రాములయ్య బావ నిన్ను తోల్కపొమ్మని చెప్పి పంపిం చింది రాజుకు తాతిల్లిచ్చిన్నాడే అన్న సంగతి మర్వకు,” అని సుద్దులు జెప్పిండు.

రాయిలెక్క నిలవడ్డది లక్ష్మి గివ్వన్నీ ఇని. ఒక్కసారి అత్తమామల మీద ప్రేమ పొంగుకొచ్చింది.

ఎన్కకు ఉరుకొచ్చి రుక్కమ్మ, రాములయ్య కాళ్లు మొక్కి, “పొయ్యొస్త,” అని కండ్లల్ల నీళ్లూరంగ నాయననెనక నడిసింది లక్ష్మి.

కండ్ల పొంటి నీళ్లు కారంగ అమ్మగారింటికి పోయే కోడలిని మొట్టమొదటిసారి ఇడ్డూరంగ చూశింన్రు, సుట్టుపక్కలోళ్లు.

*నమస్తే తెలంగాణ*
*11 నవంబర్ 2015*

*




కొట్టం రామకృష్ణారెడ్డి 24 ఆగస్టు, 1969న రంగారెడ్డి జిల్లా ఘట్‌పల్లిలో జన్మించారు. వీరి మొదటి కథ తీర్పు రచన మాసపత్రికలో ఫిబ్రవరి, 1994లో అచ్చయింది. ఇప్పటివరకు పన్నెండు కథలు రాశారు. మానవ సంబంధాలు, వాటి చుట్టూ అల్లుకున్న భావోద్వేగాలు ఇష్టమైన ఇతి వృత్తాలు.

*చిరునామా: 17-1-382/పి /123, గవర్నమెంట్ ప్రెస్ కాలని,*
*చంపాపేట్, హైదరాబాద్ - 500 059.*
*ఫోన్ : 924 6565 824 rkrkottam@gmail.com*